
# బిడియం



**ట్రెయిన్ స్టేషన్లోకి వస్తోంది.** వాటర్‌కూలర్ ఎక్కడుందో చూసుకుంటే మంచిదనుకుంటూ దుర్గ కిటికీలోంచి తల బయటకు పెట్టి చూస్తోంది. హిగ్గిన్‌బాతమ్స్ షాపు, బ్రెడ్, ఆమ్లెట్ వేసే అబ్బాయి, బెదురుగా నిలిచిన కొత్త పెళ్ళికూతురు, పరుగులు పెడుతున్న ఎర్రచొక్కాల పోర్టర్లు, కంగారుగా పెట్టెల్లోకి వెతికి చూడబోతున్న యువకుడు, విసుక్కుంటున్న ముసలాయన, ఆరంజి కలరు చీరలో అందగత్తె... అందరూ గబగబా కళ్ళముందు తిరిగి ట్రెయిన్ ప్లాట్‌ఫాం చివరకొచ్చి ఆగడంతో దుర్గ ఉస్సురంది. వాటర్ కూలర్ కోసం వెతుక్కుంటూ వెళ్ళాల్సిందే. తక్కినవన్నీ కనబడ్డాయి కానీ అది మాత్రం కంటబడలేదు.

'అవునూ, ఆ ఆరంజి కలరు చీరలో కనబడ్డది తన కాలేజీమేట్ జానకి కాదూ? పన్నెండేళ్ళయింది చూసి. గుర్తుపట్టగలదా? ఈ ఊళ్ళోనే ఉందా? ఏమో! అసలు జానకేనా! అయ్యే ఉంటుంది. అంతటి సౌందర్యం దానిదే. ముట్టుకుంటే మాసిపోతుందేమోనన్నంత తెలుపు. దాని పక్కన నుంచుంటే తనలాటి వాళ్ళని ఎవడూ కన్నెత్తి చూడడు, పన్నెత్తి పలకరించడు. అంతటి అందం దాని సొత్తు. తన పెళ్ళికి ఒకలా కారకురాలు కూడా. మంచినీళ్ల జగ్ నింపేమాట మరుపున పడి దుర్గ గతంలోకి జారుకుంది.

ఎమ్బీయస్ ప్రసాద్

తను కాలేజీ రోజుల్లో పరమరౌడీ. టామ్‌బాయ్ అనేవాడు కెమిస్ట్రీ లెక్చరరు. క్లాసులో దాదాపు అందరూ ఆడపిల్లలే కావడంతో తన అల్లరికి హద్దూ, వద్దూ లేకుండా పోయేది. కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ గ్రూపులో మగాళ్లు పెద్దగా ఉండేవారు కారు. తన క్లాసులో శేఖరం ఒక్కడే మగాడు. పేదరికం వల్లనేమో మహా బిడియస్తుడు. పప్పుసుద్ద అని ఏడిపించేది తను. ఎప్పుడూ తలవంచుకునే ఉండేవాడు. తనను చూస్తేనే హడల్. అది అలుసుగా తీసుకుని తను మరింత ఆట పట్టించేది. క్లాసులో ఉన్న నలభై మందిలో ముప్పై మంది తనకు వత్తాసు పలికేవారే. లెక్చరర్ల మీదే కాదు, మెతకగా కనబడే సాటి క్లాస్‌మేట్స్ మీద కూడా ఎన్నో ప్రాక్టికల్ జోక్స్ చేసేది.

అలాటి ప్రాక్టికల్ జోకే శేఖరం మీద వేసారు బొటానికల్ టూర్లో. తాము బసచేసిన ట్రావలర్స్ బంగళా ఊరికి చివరగా, భయం గొలిపేట్లు ఒంటరిగా ఉంది. ఆడపిల్లలంతా రూముకి నలుగురైదుగురు సర్దుకున్నారు. కూడా వచ్చిన లెక్చరర్లు కూడా లేడీసే కావడంతో శేఖరానికి విడిగా రూము ఇచ్చారు. అతను బిక్కమొహం వేసుకుని తన గదికి వెళుతూ ఉంటే తనకు ఓ ఐడియా వచ్చింది – వెంటనే తన ఫ్రెండ్సందరికీ చెప్పింది. అందరూ హుషారుగా సరే, సరే నన్నారు.

అర్ధరాత్రి దాటాక సుభద్ర – పొడుగ్గా, లావుగా ఉండేది – దెయ్యం వేషం కట్టింది. పదిమంది గడుగ్గాయి ఆడపిల్లలు తలచుకుంటే భూతాల ఎఫెక్టు తెప్పించడం ఎంతసేపు? కిటికీ రెక్కలు టపటపా కొట్టుకోవడం, తీగ పెట్టి తలుపు గడియ లేపడం, 'ఊం...' అనే శబ్దాలు, నిట్టూర్పులు, ఫాన్ పెట్టి చల్లటిగాలి గదిలోకి పంపడాలు, లైట్లు ఆర్పి వెలిగించడాలు – అన్నీ అద్భుతంగా కుదిరేయి. శేఖరం నిజంగా హడలి చచ్చిపోయినట్లే ఒక్క కేక పెట్టి విరుచుకుపడిపోయేడు.

ఆ కేకతో మేడమ్ పరిగెట్టుకు వస్తుందని భయపడ్డారందరూ. అంతలో మెట్ల మీద ఆవిడ అడుగుల చప్పుడు వినబడడంతో అందరూ పారిపోయి ఎవళ్ల గదిలో వాళ్లు దూరేసారు. తను మాత్రం మిగిలిపోయింది. మేడమ్ వచ్చి శేఖరాన్ని చూసి, లేపి వాకబు చేస్తే తాము చేసిన ఆగడం బయటపడుతుంది. తనే దీనికి నాయకురాలన్న విషయమూ బయటపడుతుంది. క్లాసందర్నీ శిక్షించలేదు కాబట్టి వాళ్లని వదిలేసి తనొక్కదాన్నీ దండించడం ఖాయం. అది తప్పాలంటే శేఖరం ఇలా మేడమ్ కంటబడకుండా ఉండడం అత్యవసరం.

మొట్టమొదట గది తలుపు వేసేసి గడియ పెట్టేసింది తను. బెడ్‌రూమ్‌లైట్ మాత్రం వేసింది. నేల మీద కూచుని శేఖరం తలను ఒళ్లో పెట్టుకుని కూచోబోయింది. నైట్‌గౌన్ టైట్‌గా ఉందేమో, సహకరించలేదు. కాస్త పైకి లాగవలసి వచ్చింది. శేఖరం స్పృహలో లేడు కదాన్న ధైర్యంతో కాస్త పైకి లాక్కుని అతడి భుజాల క్రిందుగా చేతులు వేసి పైకి లాగబోయింది. మంచి బలంగా ఉన్నాడు. లాగడం కష్టంగానే ఉంది. ఊపిరి బిగబట్టి గట్టిగా ప్రయత్నిస్తే అతని తల వచ్చి తన వక్షానికి కొట్టుకుంది. కాస్త సర్దుకుని దాన్ని తొడ మీదకు జార్చి పెట్టుకుంది.

అతని నుదుటి మీద చెమట తుడుద్దామని చూస్తే దగ్గర్లో గుడ్డ కనబడలేదు. నైట్‌గౌన్ గుండెల మీద ఫ్రిల్ పెట్టి తుడవబోతే అతని మొహానికి తన రొమ్ముల్ని వేసి రుద్దినట్టయింది. దాంతో మధ్యలో మానేసింది. మనిషిలో చలనం కనబడటం లేదు. అంతలో పాలిపోయిన అతని మొహం మీద చూపుపడగానే అనిపించింది. మంచినీళ్లు పట్టిస్తే మెలకువ వస్తుందేమోనని. నీళ్ల కూజా దూరంగా ఉంది. లేచి పట్టిద్దామంటే మళ్లీ తలకాయ ఎక్కడ కొట్టుకుంటుందోనన్న భయం. కాస్సేపు ఆగింది. మేడమ్ అడుగుల చప్పుడు వినబడుతోంది. ఆవిడ ప్రతీ రూముకి వచ్చి తనిఖీ చేస్తోందిలా వుంది. ఇంకా అక్కడ దాకా రాలేదు. ఆమె వచ్చేలోపుల ఇతనికి స్పృహ రాకపోతే ఇంతే సంగతులు.

చేయి సాచి కూజా అందుకోడానికి బాగా వంగాల్సి వచ్చింది. కూజా అందింది కానీ ఈలోపుల అతని మొహం తన శరీరానికి పూర్తిగా హత్తుకుపోయింది. గ్లాసు లేదు. కూజా ఒంపి అతని మొహం మీద చల్లడంతో కాస్త ఎక్కువగా ఒలికి తన ఒడంతా తడిసిపోయింది. నీళ్లు క్రిందదాకా పోయి

సిగ్గేసింది. శేఖరంలో కాస్త కదలిక వచ్చి చేతులు కదిపేడు. నిద్రలో దిండు చుట్టే అలవాటేమో, తన నడుం చుట్టుకుని అలాగే పడుక్కుని గట్టిగా ఊపిరి తీస్తున్నాడు. ఇంతలో మేడమ్ తలుపు తట్టింది.

ఆ చప్పుడుకి శేఖరంలో కదలిక వచ్చినట్టుంది. "ఆఁ.. ఆఁ..." అంటున్నాడు. కళ్లు తెరవలేకపోతున్నాడు. తనకి ఒక్కసారిగా భయం వేసింది. శేఖరం ఇలా మూలగడం వింటే మేడమ్ తలుపులు బాది మరీ తెరిపిస్తుందేమోనని. అతని నోటి వచ్చే శబ్దం ఆపడానికి తను చటుక్కున వంగి అతని పెదాలను తన పెదాలతో మూసేసింది. శేఖరం చప్పరిస్తూ ఉండిపోయాడు. బయట మేడమ్ రెండు, మూడు సార్లు తలుపుతట్టి గాఢంగా నిద్రపోతున్నవాడిని లేపడమెందుకనుకుందో ఏమో వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిపోయిందని రూఢిగా తెలిసిన తర్వాతనే తను లేవబోయింది. కానీ శేఖరం అప్పటికే స్పృహలోకి వచ్చేసి తనను ముద్దాడుతున్నాడు. తను లేపబోయినా నడుం పట్టుకుని వదలకపోగా తన తొడల మీద హాయిగా శయనించాడు. క్రమంగా తనను వెనక్కి వాల్చి ఒడుపుగా శరీరాలు రెండూ ఒక్కటయ్యేట్టు గాఢంగా కౌగలించుకున్నాడు. కండలు తిరిగిన అతని శరీరం ఒత్తిడికి తన శరీరం మైనపు ముద్దే అయ్యింది. అతను దాన్ని తనకు ఇచ్ఛవచ్చినట్టు మలచుకోబోతూండగా తనకు సిగ్గు ముంచుకువచ్చింది. నెట్టేయబోయింది కానీ తన వల్ల కాలేదు.

ఈ బిడియస్తుడు ఇంత రసికుడా? అని తను ఆశ్చర్యపడుతూండగానే అతని చేతులు చిలిపి పనులు చేయసాగాయి. ఒళ్లు వశం తప్పి సర్వస్వం అర్పించడానికి తను సిద్ధమయ్యే సమయంలోనే తలుపు బయట ఝాన్సీ గొంతు మెల్లగా వినబడింది. "దుర్గా, మేడమ్ నీ రూమ్‌కి వస్తోంది చెకింగ్‌కి" అని. దానితో అప్పటి కార్యక్రమానికి అంతరాయం కలిగింది.

కానీ నాలుగురోజుల తర్వాత మునిమాపువేళ పూలతోటలో అలాటి అంతరాయం ఏదీ రాకపోవడం చేత తామిద్దరూ ఒకటవడం జరిగింది. అసలు తనకి శేఖరం అంటే ఎప్పుడూ ఉద్దేశ్యం లేకపోయినా ఆ రాత్రి సంఘటన వల్ల అతని శరీరం తనకు పరిచయమై తనను నిలవనీయలేదు. టూర్ నుండి తిరిగివచ్చాక ఒకరి మనసు మరొకరికి ఇచ్చిపుచ్చుకోవడం, పోట్లాడి యింట్లోవాళ్లను ఒప్పించడం, దరిమిలా వివాహం జరిగాయి. ఇప్పుడు పన్నెండేళ్ల తర్వాత ఆ సంఘటన దాదాపు మరుపున పడుతున్నప్పుడు జానకి కనబడడం... జానకేనా?'

రైలు ఇంజన్ జర్క్ ఇవ్వడంతో దుర్గ వర్తమానంలోకి వచ్చిపడింది. రైలు ఇంకా ఐదు నిమిషాలుంటుందని ఎవరో అంటున్నారు. నీళ్లు పట్టుకుంటే మంచిదనుకుని వాటర్‌జగ్ తీసుకుని రైలు దిగి కూలర్ వెతుక్కుంటూ వెళ్లింది. కూలర్ కోసం చూస్తూండగానే "హాయ్, దుర్గా" అని భుజం మీద చేయి పడింది. తిరిగిచూస్తే జానకి!

"అయితే నువ్వు నువ్వేనన్నమాట! ఆరంజికలర్ శారీ..."

"ఏడిసినట్టుంది. అంటే నన్ను చూసి గుర్తుపట్టలేదన్నమాట! నీకు ఒళ్లొచ్చింది కానీ నాకు రాలేదుగా" అంది జానకి నవ్వుతూ.

"అవునే నేను పెళ్లయినదాన్ని. నువ్వైతే... అవునూ పెళ్లి చేసుకున్నావా ఇప్పటికైనా?"

"లేదు. ఈ ఊళ్లోనే లెక్చరరు ఉద్యోగం వెలగబెడుతున్నాను. నీలాటి స్టూడెంట్లతో రోజూ వేగుతూంటే చాలదూ, మళ్లీ మొగుడొకడా? అవునూ, శేఖరం ఎలా వున్నాడు?"

"అదేమిటే.. పెళ్లి చేసుకోవాల్సింది... నిన్ను చూసి ఫ్లాష్‌బాక్‌లోకి వెళ్లిపోయాను. మా పెళ్లి నీ వల్లే అయిందని గుర్తొచ్చింది. గుర్తుందా? ఆ ప్రాక్టికల్ జోక్ చేయద్దని నువ్వు నన్ను వారించావు. శేఖరానికి ముందే చెప్పేస్తానని బెదిరించావు. చెప్పి ఉంటే అతను రూములోంచి పారిపోయి వుండేవాడు. మా మధ్య జరిగినది జరక్కుండా పోయేది. నా రిక్వెస్టు మన్నించి శేఖరానికి చెప్పకుండా నాకు మేలు చేసావు కాబట్టి మా పెళ్లికి నువ్వు ఒకలా కారణమనే చెప్పాలి."

"దుర్గా, నీకో రహస్యం చెప్పనా?" అంది జానకి ఆర్ద్రంగా.

"ఏమిటా రహస్యం?"

"నేను ఆ రోజు శేఖరం వద్దకు వెళ్లి నీ ప్లానంతా చెప్పేసాను"

"మరి?..." అంది దుర్గ తెల్లబోతూ.

"శేఖరానికి నువ్వంటే ఇష్టం లేదప్పుడు. డబ్బున్నదానివి కాబట్టి పొగరనేవాడు. నిన్ను ఖంగారుపెట్టి అల్లరి పెడదామనే అలా నటించాడు. తను కేక పెడితే నువ్వు ఒంటరిగా మిగిలిపోతావని ముందే ఊహించాడు. కానీ తర్వాత జరిగినది అలా జరుగుతుందని ఊహించలేకపోయాడు. మీ ఏకాంతం ఎంతవరకూ దారితీస్తుందో అతనికీ తట్టలేదు."

"నిజంగానా? పోన్లే తర్వాత ఇష్టపడే చేసుకున్నాడుగా. ఇంతకీ నేను వద్దని బతిమాలినా నువ్వెందుకు వెళ్లి చెప్పినట్టు?"

"ఎందుకంటే... ఎందుకంటే... నేను శేఖరాన్ని ప్రేమించాను కనుక. నీ ఆకతాయి పన్లు చెప్పి నీ మీద అసహ్యాన్ని పెంచుదామనుకున్నాను కనుక. చివరికి నేను స్నేహితురాలిగా మిగిలిపోయాను. నువ్వు ప్రియురాలిగా తర్జుమా అయిపోయావు" అంది జానకి విషాదంగా చిరునవ్వు నవ్వుతూ.

దుర్గ ఏమీ మాట్లాడలేదు. స్నేహితురాలి చేతిని తన చేతిలోకి తీసుకుంది. రైలు కూత వేసి బయల్దేరబోతూంటే రైలెక్కుతూ అడిగింది. "శేఖరాన్ని పొందలేకపోయినందుకేనా ఈ బ్రహ్మచర్యం?" అంది.

కన్నీరు తుడుచుకుంటూ అవునన్నట్టు తలూపింది జానకి.

●

(ఆంధ్రభూమి వీక్లీ అక్టోబరు 1999)